ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

# నానీల సుగంధం - కవిత్వ పరిశీలన

**జి. కుమార్ రాజా**
పరిశోధక విద్యార్థి
యోగి వేమన విశ్వవిద్యాలయం కడప
వేమనపురం .
చరవాణి 7730896943.

Article Received: 18/06/2025 ; Article Accepted: 01/07/2025; Published Online: 02/07/2025

DOI:10.53414/Sahithyatharangini.2025.2411

**ఉపోద్ఘాతం:-**

నానీలు అంటే నావీ నీవి వెరసి మనవి అని అర్థం. అంటే నానీలు మనవేనని అర్థం చేసుకోవాలి. మన ఇళ్లలో చిన్న పిల్లవాడిని నానీ అని పిలుస్తుంటాం. అలా తెలుగు కవిత్వం నానీలు చిన్నవి చిన్న చిన్న పదాలతోనే పెద్ద పెద్ద భావాలను ఆవిష్కరించే ప్రయత్నమే నానీలు యొక్క కవితా గుణం. దీనికి అక్షర నియమం తప్పితే ఛందో నియమం లేదు, నాలుగు పాదాల పద్యాన్ని ఛందస్సులో ఆవిష్కరిస్తే అవే నాలుగు పాదాల నానీలను ఛందస్సు లేకుండా ఆవిష్కరించడం నానీల ప్రత్యేకత.

కవి యొక్క హృదయం లోతుల్లో దాగిన అంతర్గత భావాలను వ్యక్తం చేయడానికి సాహిత్యకారులు వివిధ ప్రక్రియలు ఎంచుకోవడం చూడవచ్చు. ఆ కోణంలో నుండి డాక్టర్. గిన్నారపు. ఆదినారాయణ నానీలు అనే కవిత్వ నిర్మాణం ద్వారా సాహిత్య ప్రపంచంలో అడుగులు వేస్తున్నాడు.

నానీల సుగంధం అనే గ్రంథంలో రచయిత పాటకుల దృష్టికి వివిధ కోణాలలో తన హృదయాన్ని తెరిచి పెట్టాడు.

నానీలను బాగా పరిశీలన చేసినట్లయితే ఇందులో పాఠకుడికి సామాజిక, రాజకీయ, ఆర్థిక, రైతుల ఆక్రందన, సమాజంలో గురువుల స్థానం, కరోనా నేర్పిన పాఠాలు, ప్రకృతి వర్ణన, మానవ సంబంధాలవంటి, అంశాలు విశ్లేషణ చేయుటకు అవకాశం ఉందని గ్రహించవచ్చు.

ఈ పుస్తకం యొక్క మరొక విశేషం తనకు విద్యాబుద్ధులు నేర్పించిన ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు గారికి గురు దక్షిణంగా ఈ నానీల సుగంధం అంకితం ఇవ్వడం గమనించవచ్చు.

ఈ నానీలో ఘాటైన కవిత్వం మనసును ఆలోచింపజేస్తుంది ప్రస్తుత సమాజంలో మనిషి బతకడానికి ఎట్లా అవస్థ పడుతున్నాడు ఇందులో చూడవచ్చు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

**కీలక పదాలు**:బస్తీ వాసుల కన్నీళ్లు, చలికి వణుకు మొదలైంది, కన్నీటితో పండిస్తున్నాడు, నేలను చెమటతో తడిపాడు, రైతు కష్టం యవ్వనమైంది, దళారుల పద్మవ్యూహం, పాత జ్ఞాపకాలు, మనుషులు కలిస్తేనే సఖ్యత, మట్టి ముద్దలే, అనుబంధాల డొల్లలే,

**వ్యాస సంగ్రహం.**

**సామాజిక అంశాలతో కూడిన నానీలు :-**

**వర్షం తగ్గినా/రోడ్లు ఉప్పొంగుతున్నాయే**

**బస్తీ వాసుల / కన్నీళ్లు అవి**

కవి తన తొలి నానీలోనే సామాజిక స్పృహను పాఠకులు అందుపుచ్చుకోవాలి. అకాల వర్షాలు వలన పట్టణ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొనే అగచాట్లు గురించి పైన పేర్కొనడం చూడవచ్చు పెరిగిన పట్టణీకరణ వలన హైదరాబాద్ వంటి మెట్రో పాలిటన్ నగరాలలో కనీస వసతి సౌకర్యాలు లేకుండా మురికివాడల్లో జీవిస్తున్న ప్రజలను ఆకస్మికంగా సంభవించే వర్షాలు బస్తీ వాసులను ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తున్నాయని దీనిలో గ్రహించవచ్చు.

డాక్టర్. గిన్నారపు ఆదినారాయణ హృదయంలో దాగివున్న మరొక సామాజిక నాడిని పరిశోధకులు పట్టుకోవాలి. మట్టితో తనకున్న సంబంధాన్ని పెనవేసుకుంటూ హాలికుడి గర్భమున జన్మించిన నిజమైన రైతు కుటుంబంలో జన్మించాడు కాబట్టే ఆదన్న, రైతు యొక్క శ్రమను అతను ప్రస్తుత కాలంలో అనుభవిస్తున్న పరిస్థితులను నానీల సుగంధంలో ఆవిష్కరించిన తీరు మనసును హత్తుకుంటుంది. అంతేకాకుండా అభ్యుదయ కవిగా, శ్రామికుడిగా వారి పక్షాన పోరాటం చేయవలసిన గురుతర బాధ్యతను గుర్తు చేస్తున్నాడు.

**రైతు నేలను / చెమటతో తడిపాడు**

**ప్రపంచం / కడుపు నిండిపోయింది**

రైతు ఆరుగాలం తన రక్తాన్ని చెమట బిందువుల మార్చుకుని నేలతల్లిని కంటికి రెప్పలా కాసుకుని కన్నీటితో విత్తులను విత్తి పంటలు పండించడం వలన మానవజాతి అందరి కడుపు నింపుతున్నాడని ఉదాహరిస్తున్నాడు.

దేశానికి వెన్నుముక రైతుని చెప్పుకునే మనము రైతులను ప్రభుత్వాలు ఏ విధంగా దోపిడీ చేస్తున్నాయో ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమాలే ప్రత్యక్ష సాక్షాలుగా చెబుతున్నాయి.

**రైతు ట్రాక్టర్లు / ఢిల్లీ చేరుకున్నాయి**

**చలికి / వణుకు మొదలయ్యింది.**

2020 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన చట్టాలు రైతులకు ఎంత నష్టాన్ని చేకూరుస్తున్నాయో తెలపడం కోసం తమ హక్కుల కోసం ఎముకల కొరికే చలిలో తమ ప్రాణాలను లెక్కచేయకుండా ఢిల్లీ నడిబొడ్డున మొక్కోని దీక్షతో బెదరకు ఉండడం వలన రైతు వ్యతిరేక బిల్లును పార్లమెంటు 2022 సంవత్సరంలో రద్దు చేయడం జరిగిందని ఇది వారి త్యాగాలకు తక్కిన ప్రతిఫలంగా కీర్తిస్తున్నాడు.

**జై జవాన్ - జై కిసాన్ అని** గొప్పగా చెప్పుకునే సగటు భారతీయ మనిషి ముందు గొప్ప సవాలు ఉందని చెబుతూ రైతు ఆవేదనను కవి ఈ క్రింది విధంగా ఆవిష్కరింప చేశాడు.

**పంటను / రైతు నీటితో కాదు**

**కన్నీటితో / పండిస్తున్నాడు**

దేశానికి పట్టెడన్నం పెట్టి రైతన్న నేడు అనేక కష్ట నష్టాలను ఎదుర్కొంటున్న తీరును ఈ కవితలు చూడవచ్చు పెరిగిన రసాయనిక ధరలు ఒకవైపు, కష్టంచి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక దళారీ చేతుల్లో మోసపోతూ చివరికి అప్పుల్లోనే కన్నీటితో జీవితాన్ని ముగిస్తున్నాడని తెలుసుకోవచ్చు.

తొలకరి చిరుజల్లులు పుడమికి పరవశం కలుగజేసినట్లే రైతుకు కూడా తొలకరి జల్లు హృదయాన్ని వికసింప చేస్తుంది.

**వర్షం రాకతో / రైతు మనసు విచ్చుకుంది**

**రోజు కురుస్తుంటే / నొచ్చుకుంది.**

తొలకరి వర్షం / ఏరువాక వర్షం రైతు హృదయాన్ని ఆనంద డోలికలలో ఊరేగిస్తే ఎంత సంబరపడిపోతాడో.ఎటువంటి వాతావరణ హెచ్చరిక లేకుండా ప్రతిరోజు కురిసే అతివృష్టి వర్షం వల్ల రైతు తాను పండించిన పంట వర్షార్పణం అవుతున్నప్పుడు ప్రభుత్వాలు కొనుగోలు చేయక, నష్టపరిహారం చెల్లించక, గిడ్డంగుల సదుపాయాలు కల్పించకపోవడం ఎంతో దురదృష్టకరమైనదని రైతు వ్యధను వ్యక్తీకరించాడు.

రచయిత మరొక కవిత శైలీలో రైతు శ్రమను మరిచి ఆనందంగా ఉండే క్షణాలను మన ముందుకు తీసుకు వస్తున్నాడు.

**వరి పంట / వంగి నేలను ముద్దాడింది**

**రైతు కష్టం / యవ్వనమయింది**

దీనిలో దాగి ఉన్న పరమార్థం ఏమిటంటే రైతు తాను పండించిన పంట పుష్టి కలిగి గట్టి గింజతో ఉంటే ఎంతో సంతోషం కలిగిస్తుందని కవి అలంకారప్రాయంగా ప్రయోగించాడు. యవ్వనమైందని ఎదుగోచ్చిన కూతురు,

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

కొడుకు యవ్వనంలో ఎంతో ఆకర్షణీయంగా బలంగా ఉంటారో తాను పెంచిన వరి కంకి అంతే ఆకర్షణీయంగా బలంగా ఉన్నాయని తెలుపుతున్నాడు.

భారతీయ వ్యవసాయ సమాజంలో దళారీ వ్యవస్థ రైతులను ఏ విధంగా దోపిడీ చేస్తున్నాయో వాటి దోపిడీకి గురవుతూ సరైన టువంటి గిట్టుబాటు ధర లభించక చేసేది ఏమీ లేక మరణమే శరణ్యముంటు బలవంతంగా ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న టువంటి సంఘటనను ఈ నానీలలో గమనించవచ్చు.

**నేటి భారతంలో / దళారుల పద్మవ్యూహం**

**రైతే /అభిమన్యుడు**

**ఎక్కడ చూసినా / రైతు ఆత్మహత్యలే**

**కలియుగం కాదిది / ఆకలి యుగం**

**రైతులను / చంపుతుంది**

**సమ సమాజం కాదు / గిట్టుబాటు లేని సమాజం.**

పైన పేర్కొన్న కవితలలో పరిశీలన చేసినట్లయితే రైతుని తలారీ వ్యవస్థ ఏ విధంగా మోసం చేస్తూ ఉన్నాయో చూడవచ్చు తన రక్తం బిందువులను చెమటగా మార్చి తాను ఉత్పత్తి చేసిన వస్తువులకు యజమానుడు కాలేకపోతున్నాడు రైతు. ఏ కష్టం ఎరుగని దళారి రైతుకు వెన్నుపోటు పొడుస్తూ వంచిస్తున్న తీరును వీటిలో చూడవచ్చు. మానవ సమాజానికి పట్టెడన్నం పెడుతున్న రైతు ఈరోజు బలవంతంగా ప్రాణాలు తీసుకోవడం మనమందరం సిగ్గుతో తలదించుకోవలసిన పరిస్థితులు తీసుకువచ్చిన కారకులెవరని కవి ప్రశ్నిస్తున్నాడు. ప్రభుత్వాలు దళారీలుతో చేతులతో కలిపి రైతు పండించినటువంటి పంటలకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తూ అప్పులు ఊబిలో నెట్టేస్తూ చావే దిక్కని బలవంతంగా మరణించడానికి ప్రత్యక్షంగా కారకులవుతున్నారని నిక్కర్చిగా తన ఆక్రందనను వ్యక్తపరుస్తున్నాడు.

ఇంకా ఆదన్న రైతును ప్రత్యక్షంగా కనిపించే దేవుళ్ళని సంబోధిస్తున్నాడు.

**రైతులు / కనిపించే దేవుళ్ళు**

**తాము పస్తుండి / ప్రపంచం కడుపు నింపుతాడు.**

ఒక నిజమైన రైతు కుటుంబంలో నుండి వచ్చినవాడు కాబట్టే ఆదన్న రైతును ప్రత్యక్ష దైవంగా గౌరవిస్తున్నాడు. అమ్మ ఏ విధంగా అయితే తన బిడ్డల కడుపు నింపడానికే మొదట ప్రయత్నం చేస్తుందో. అదే రీతిలో ప్రపంచం యొక్క ఆకలి తీర్చడానికి రైతు అమ్మల తన బాధ్యతను భుజానికి వేసుకొని ప్రపంచాన్ని ఈదుగుతున్నాడు .

**ప్రకృతి వర్ణన కూడిన నానీలు.** ప్రకృతి మానవుని యొక్క స్మృతులను నెమరు వేసుకోవడానికి దోహదపడుతుంది. ప్రకృతి మానవుడికి వరం సృష్టించబడిన ప్రతి వస్తువు ఎంతో అందంగా ఆహ్లాదంగా మనిషి హృదయాన్ని తాగుతుందో ప్రకృతి వర్ణనతో కూడిన నానీలు పరిశీలించవచ్చు.

**సంక్రాంతి / భోగి మంటల వెలుగు**
**కాలుతున్న / పాత జ్ఞాపకాలు**

తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలలో అతి ముఖ్యంగా పరిగణించే పండుగ సంక్రాంతి. పండుగ పర్వదినం మొదటి రోజు భోగితో ప్రారంభమవుతుంది. అప్పుడే కొత్తగా తెచ్చుకున్న ధాన్యం గింజలు, ఇంటికి వచ్చిన చుట్టాలతో భోగి మంటలు వేసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ప్రకృతిని ఆస్వాదించడం ఒక గొప్ప మధురానుభూతిని కలిగిస్తుంది.

మనిషికి ప్రాణవాయువు యొక్క ఆవశ్యకతను తెలుపుతూ ఇలా అంటున్నాడు.

**ప్రకృతిలో / ఆక్సిజన్ ఉచితం**
**హాస్పిటల్ లోనే / అందరానిది.**

దైవానుగ్రహంతో మానవుడికి ఉచితముగా ప్రకృతిలో లభిస్తున్నటువంటి ఆక్సిజన్ నేడు సాంకేతిక కారణాలు నగరీకరణ వలన చెట్లను అడవులను విచక్షణ రాహిత్యంగా ధ్వంసం చేయడం వలన స్వచ్ఛమైన ప్రాణవాయువును నేడు మానవుడు పొందుకోలేకపోతున్నాడని వాపోతున్నాడు.

పొద్దు పొద్దున్నే తూర్పు దిక్కు పొడిచే సూర్యకిరణాలు మానవజాతికి పంటలకు కలుగజేసే సూర్యోదయం గొప్పతనాన్ని వివరిస్తున్నాడు

**వణికే శరీరానికి / వాలిపోయే పంటలకు**
**ఇంజక్షన్ / సూర్యోదయం.**

తొలిసంధ్యలో ప్రసరించే సూర్యకిరణాలు మనుషుల ఎముకులకు కావలసిన ప్రకృతి ప్రసాదితమైన విటమిన్ డి అందించి బలాన్ని చేకూరుస్తాయి. అంతేగాకుండా తొలి సూర్యకిరణాలు పంటచేలపై ప్రచురించడం వలన కీటక నాశనలు కూడా తొలగిపోతాయని అందుకనే సూర్యుడు ప్రకృతి నేస్తం అని తెలుపుతున్నారు.

ప్రకృతి జీవుడికి ఎన్నో ప్రయోజనాలు కల్పించడంతోపాటు ఎన్నో మధురమైన సంతోషాలను పంచి పెడుతుందని తెలుపుతూ క్రింది నాని లో ఇలా మాట్లాడుతున్నాడు.

**పిల్లలకు / మట్టితో ఆడడం ఇష్టం**
**నేలతల్లి / ఇష్టపడింది ఎవరిని**

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

మట్టితో పెను వేసుకున్న బాల్యపు స్మృతులను కవి జ్ఞాపకం చేసుకుంటున్నాడు. అవును నేలమ్మ అందరిని సమానంగా ఆదరిస్తుంది. దానికి చిన్న పెద్ద తేడా లేదు. అందరికీ కమ్మనైన మధుర జ్ఞాపకాలు అందిస్తుంది.

మట్టితో మనిషికి ఉన్న సహజ సంబంధం వలన ప్రకృతిని ఎంతగా గౌరవిస్తాడో ఈ కింది కవితలో గమనించవచ్చు.

**రైతు / మట్టితో సహజీవనం**

**మరణించాక / మట్టి దుప్పటి తోడని కావచ్చు.**

రైతు సూర్యోదయం మొదలుకొని సూర్యాస్తమయం వరకు మట్టితో ముడి వేసుకున్న బంధుత్వాన్ని కవి పాఠకులకు వివరిస్తున్నాడు. రైతు మరణించాక కూడా మట్టిని దుప్పటిలా తన దేహం పై కప్పుకుంటాడని ప్రకృతితో తన బంధాన్ని శాశ్వతంగా అలాగే ఉంచుకోవాలని ఆశ పడుతున్నట్టు చక్కగా వ్యక్తీకరించాడు.

**మానవ సంబంధాలతో ముడిపడిన నానీలు:-**

వర్తమానం భారతీయ సమాసంలో మానవ సంబంధాలు ఏ విధంగా ఉన్నాయో మనం ప్రతిరోజు పత్రిక రంగంలో సోషల్ మీడియా వేదికలలో చూస్తుంటే అవగతం చేసుకోవచ్చు ఆదన్న తన నానీల సుగంధంలో మానవ సంబంధాల యొక్క ప్రాముఖ్యతను బాగానే కవిత్వకరించాడు.

లోకంలో ఉన్న సామెత ఏమిటంటే కలిసి ఉంటే కలదు సుఖం, ఐక్యమత్యమే మహాభాగ్యమని పెద్దలు చెప్పడం జరిగింది.

**మనుషులు కలిస్తే / ఐక్యత**

**మనసులు కలిస్తేనే / సఖ్యత.**

ఇందులో దాగివున్న గొప్ప సందేశం చదువరులు గ్రహించి తీరాలి అన్నదమ్ముల వలె కలిసి ఐక్యంగా ఉంటేనే ఎంతటి సమస్య అయినా సాధించగలుగుతామని విడిపోతే అందరూ ఇబ్బందులు పాలవుతారని చాలా చక్కగా చెబుతున్నాడు.

ఇంకా రెండు మనసులు కలిసినప్పుడే ఆ సంబంధంలో సఖ్యత ఏర్పడుతుందని కవి విశేదికరిస్తున్నాడు సఖ్యత,సమాధానం లేనిచోట మనుషులు కలిసి ఉండలేరని పాఠకులు ఇందులోని సత్యాన్ని అర్థం చేసుకోవాలి.

జీవుడు చనిపోయిన తర్వాత మన్నులో కప్పివేసే దేహాలకు సమాజం అంటగట్టే కుల మతాల గురించి నిరసిస్తూ ఈ కింది నానీలో ఈ విధంగా మాట్లాడుతున్నాడు .

**ఈ దేహాలన్నీ / మట్టి ముద్దలే**

**కుల మతాల /తూకమెందుకు.**

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

జీవుడు మరణించాక అందరిని సమానంగా మట్టిలో కలుపుకుని నేలతల్లికి లేని కుల రక్కసి కంపు, మతమౌఢ్యం మీకెందుకురా అని అగ్రవర్ణ ఛాందస వ్యక్తులను నిలదీస్తున్నాడు. అందరము ఒట్టి మట్టి ముద్దలమే కాబట్టి కులమతాల అడ్డు గీతాలను తొలగించండి అంటూ ప్రశ్నిస్తున్నాడు సమాజాన్ని.

**అన్నా తమ్ముడు / ఒక్క తల్లి పిల్లలే**

**ఆస్తుల ముందు / అనుబంధాలు డొల్లలే.**

ఈ కవితలో మానవ సంబంధాలు అనుబంధాలు అన్నీ కూడా ఆస్తుల పంపకాలలో కనుమరుగుతున్నాయని తెలుసుకోవచ్చు అవును ఈ మాటలను అంగీకరించి తీరవలసిందే.ఒకే తల్లి గర్భంలో పుట్టిన తన అన్న తాగి వదిలిన పాలను తాగి పెరిగిన అన్నదమ్ములు అక్క చెల్లెలు ఈరోజు తల్లిదండ్రులను సరిగా చూసుకోవడం మానేసి ఆస్తులు కోసం ప్రాణాలు కూడా తీయడానికి వెనకడుగు వేయడం లేదని మనం నిత్యం చూస్తున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. బంధాల కంటే కూడా ప్రస్తుత దినాలలో మనిషి ఆస్తులకే ఉన్నాయి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం గమనించవచ్చు.

మరొక కవితలో సంబంధాలన్నీ ఆర్థిక బంధాలయ్యాయి అని ఆందోళన చెందుతున్నాడు కవి

**మానవ బంధాలు / ఆర్థిక బంధాలయ్యాయి**

**మనిషి / మనీ కొనాలి ఇక!**

ఈ నానిలో ప్రధానంగా గుర్తించవలసిన విషయం ఒకటి ఉంది. ప్రతి మనిషికి ఆర్థిక పరపతి అవసరమైనదే, కానీ సంబంధాలను ఆర్థిక హోదాతో ముడిపెట్టి, మనుషుల మధ్య ఉన్న స్నేహ సంబంధాలను చెరిపేసుకుని విడిపోవడం మంచిది కాదని అభిప్రాయపడుతున్నాడు.

**అంతర్జాల మాయలో చిక్కుకున్న చిన్నారుల జీవితాలకు సంబంధించిన నానీలు**

కరోనా తర్వాత ప్రపంచ దేశాలన్నీ కూడా ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య అంతర్జాలం ఇది చిన్నారులను బానిసలుగా చేసుకుని వారి యొక్క మానసిక స్థితి పైన ఒత్తిడి పెంచుతుంది. నెట్వర్క్ అందుబాటులో లేకపోతే చిన్నారులు ఎంతగా యంగ్జైటీకి గురవుతున్నారో ప్రస్తుత కాలంలో మనం చూస్తున్నటువంటి ప్రపంచం ఇది.

**అందరి చేతుల్లోకి / సెల్ ఫోన్లు చేరాయి**

**ఇక మనిషి / ఒంటరి జీవి.**

కవి రాసిన ఈ మాటలతో కచ్చితంగా ఏకీభవించవలసిందే మనిషి చుట్టూ ఉన్న వ్యక్తులతో కాకుండా ఎలక్ట్రిక్ గ్యాడ్జెట్స్ తో ఈరోజు బంధించబడి ఒంటరిగా జీవిస్తున్నాడనే సత్యాన్ని సమాజం గ్రహించాలి.చుట్టూ జరుగుతున్నటువంటి సంఘటనలను ఏమాత్రం కూడా పట్టించుకోకుండా తానున్న లోకంలో ఫోన్ తోనే

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

సమయాన్ని గడుపుతూ యాంగ్జైటీ గురవుతూ పిచ్చోళ్ళు వలె మారిపోయిన చిన్నారుల సంఘటనలను సోషల్ మీడియా వేదికగా, పత్రికల ద్వారా చదువుతున్నాము.

**ప్రతి తల్లికి /పిల్లలే లోకం**

**పిల్లలకు / సెల్ ఫోనే ప్రపంచం**

ప్రతి తల్లికి తన కడుపున పుట్టిన పిల్లలకు పంచప్రాణాలు అడ్డు పెట్టుకుని కంటికి రెప్పలా కాసుకుంటూ అల్లారుముద్దుగా పెంచుకుంటుంది. తల్లికి బిడ్డ తప్ప మరొక లోకం తెలియదు. కరోనా తర్వాత ప్రపంచ దేశాలన్నీ ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య సెల్ ఫోన్ పిల్లలను ఏ విధంగా బానిసగా చేసుకుంటుందో ఆందోళన కలిగిస్తున్నటువంటి సమస్యగా పరిగణించాలి నిద్రాహారాలను మానేసి ఆకలిని సైతం పక్కనపెట్టి నిత్యం ఆన్లైన్ గేమ్స్ కి బానిసలై మానసిక తృప్తి కోసం విపరీతంగా ఆటలు ఆడుతూ చివరికి ఎంతోమంది పిల్లలు తమ తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగులుస్తూ ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోతున్న సంఘటనలు నిత్యం మనం చూస్తూనే ఉన్నాం.

**ఉత్పత్తి కులవృత్తులకు సంబంధించిన నానీలు.**

ప్రపంచీకరణ నేపథ్యంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం వలన యంత్ర పరికరాలు కనుగొనడం వలన వస్తువుల ఉత్పత్తి వేగంగా పెరిగి తక్కువ సమయంలో ఎక్కువ లాభార్జనతో బడా కంపెనీలు ఎదుగుతున్న తీరు వలన ఉత్పత్తి కులవృత్తులు ఏ విధంగా సన్నగిల్లిపోయి నష్టపోతున్నారు ఆదన్న వారి పక్షాన నిలబడి మాట్లాడుతున్నాడు.

**ఉత్పత్తి వృత్తులన్నీ / బహుజనులవి**

**ప్రపంచీకరణ / బాధితులు**

**నేడు చెప్పుల బ్రాండ్ నేమ్ / బాట**

**కనిపెట్టిన వాడికి / అదే బతుకుబాట**

**వడ్రంగి బాడిసె / మొండిబోయింది**

**ప్రపంచీకరణతో / కొత్తరూపు**

**దారం పోగులు /ఉరి తాళ్లయ్యాయి**

**చేనేతకు / చేయూతనివ్వండి**

పైన పేర్కొన్న నానీలను పరిశీలించినట్లయితే భారతీయ సమాజంలో చేతువృత్తులకు ప్రత్యేకమైన స్థానం కలదు. మారుతున్న అవసరాల దృష్ట్యా పెరిగిన యాంత్రిక పరిజ్ఞానం వలన తక్కువ సమయంలో ఎక్కువ మోతాదులో వస్తువులను ఉత్పత్తి చేస్తూ మార్కెట్లలో అధిక లాభాలు ఆర్జిస్తున్న బడా కంపెనీలు కిందిస్థాయి వృత్తుల వాళ్లను ఏ విధంగా నష్టపరుస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. చేనేత వృత్తులకు, కల్లుగీత

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

కార్మికులు,వడ్డెర శ్రామికులు మాదిగ జాతి కులవృత్తి అయిన చెప్పులు కుట్టడం ఇవన్నీ ప్రపంచీకరణ పెరిగిన తర్వాత చతికిలపడి దుక్కిస్తున్నట్లు అర్థం చేసుకోవచ్చు.

**ఇతర నానీలు :-**

**సమాజంలో స్త్రీ స్థానం**

**చట్ట సభల్లో / స్త్రీలకు గౌరవం దక్కింది.**

**చుట్టున్న జనంలోనే / దక్కాల్సింది .**

ఈ దేశ చట్టసభల్లో స్త్రీలకు 33న్నర శాతం రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్ ఫలాలను పొందుకుంటున్నారు. కానీ సమాజంలో స్త్రీ శ్రమకు దక్కవలసిన వేతనము, కుటుంబంలో మహిళ పొందవలసిన గౌరవాన్ని పొందడం లేదని కవి నిరసిస్తున్నాడు మహిళా పక్షపాతిగా తన కలం ఝుళిపిస్తున్నాడు. అందుకని చట్ట సభల్లో కంటే కూడా ముందుగా స్త్రీని గుర్తించవలసింది గౌరవించవలసింది సమాజంలోనే బలంగా నమ్ముతున్నాడు.

**సమయం విలువ తెలిపే నానీ:-**

**కాలానికి / అన్నీ తెలుసు**

**కొందరిని భూమిపై / ఇంకొందరినీ భూమిలో ఉంచుతుంది.**

సమయము పోనీయక అజ్ఞానుల వలె కాక జ్ఞానుల వలె ప్రవర్తించుమని ఒక సామెత లోకంలో బాగా వింటాం. కాలం ప్రతి మనిషికి ఉన్నతంగా ఎదగడానికి అవకాశం ఇస్తుంది. దాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించి ఇలలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న వాళ్ళు చరిత్రలో చాలామంది కనిపిస్తారు. సమయాన్ని దుర్వినియోగం చేసుకొని చేతులారా జీవితాన్ని నాశనం చేసుకొని అష్ట కష్టాలు పడుతూ బతుకు భారంగా ఈడుస్తున్న మనుషులను కూడా సమయం మన కళ్ళముందు పెట్టింది. వారిని చూసి గుణపాఠం నేర్చుకుంటూ సమయం ఉండగానే జీవితమనే చదరంగాన్ని సరిదిద్దుకోవలసిన బాధ్యతను గుర్తు చేస్తున్నాడు.

**పట్టుదల సంబంధించిన నానీ**

కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పుణ్య పురుషులవుతారు అని ఒక సినీ గేయ కారుడు పాట రూపంలో వ్యక్తపరిచాడు.

**సాకె భారతి / కెమిస్ట్రీలో పీహెచ్డీ**

**పట్టుదలకు / లొంగనిదేముంది**

అనంతపురం జిల్లా మారుమూల పల్లెటూరికి చెందినటువంటి సాకే భారతి మొక్కోని పట్టుదల, అంకుటిత దీక్షతో చదివే ధ్యేయంగా కష్టించి తనకి ఇష్టమైన కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్ పొందుకొని ఎందరో మహిళా మణులకు స్ఫూర్తి నింపారు . వైవాహిక జీవితాన్ని నెరవేరుస్తూనే కుటుంబాన్ని పోషిస్తూ తన తీరిక

సమయంలో ఇష్టంతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగడానికి కష్టాలు, నష్టాలు ఆపవని తన జీవితం ద్వారా నిరూపించింది. పరిశోధక రంగంలో ప్రయాణం సాగిస్తున్న ఎందరో యువ పరిశోధకులకు మార్గదర్శకంగా నిలిచింది.

**అంతర్గత సౌందర్యం తెలిపే నానీలు**

ఈ నానీలను ఉదాహరించడానికి రెండు ఆధ్యాత్మిక సామెతలను ఇందులో ఉపయోగించడానికి ఇష్టపడుతున్న. మనుషుడు పై రూపాన్ని లక్ష పెడతాడు కానీ దేవుడు హృదయాన్ని లక్ష్యపెడతాడని దావీదు సందర్భంలో చూస్తాం. అదేవిధంగా సామెతల గ్రంథంలో చివరి అధ్యాయంలో ఒక చక్కటి మాట ఉంది అది ఏమనగా అందం వ్యర్థమని సౌందర్యం మోసకరమని సొలోమోను ఉపయోగించడం మనం చూడగలం.

**మనిషికి / ఆభరణాలు కాస్త అందం**

**అంతర్గత గుణం / శాశ్వత సౌందర్యం.**

ప్రతి మనిషికి తగుమాత్రపు అలంకరణ అందాన్ని చేకూరుస్తుంది అది శృతి మించితే మనిషిని అంద విహీనంగా చూపిస్తుంది. పైకి కనిపించే బాహ్య సౌందర్యం కంటే కూడా మనిషి అంతర్గతంలో ఉన్న గుణం మాత్రమే శాశ్వత సౌందర్యం చేకూరుస్తుందని అభిప్రాయపడుతున్న.

**ముగింపు:-**

సామాజిక స్పృహతో కూడిన నానీలు ఈ సంకలనంలో పరిశీలించవచ్చు. కవి తన చుట్టూ జరుగుతున్నటువంటి పరిణామాల నుంచి సాహిత్య ముడి సరుకును వస్తువుగా సేకరించాడు. ఈ నానీలు రాజకీయ, ఆర్థిక, సామాజిక, మానవ సంబంధాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాయి. పాఠకులను ఆసాంతం కదలనీయకుండ కట్టిపడేస్తాయి. రచయిత దృష్టి కోణంలోనే ఈ నానీలను పరిశీలించవలసిన బాధ్యత యువకుల కవుల మీద, పరిశోధకుల మీద ఆధారపడి ఉంది. ఈ నానీల సుగంధ గ్రంథం కవిత్వం మనిషిలో దాగివున్న అంతర్గత భావాలను హృదయ లోతుల్లో నుంచి ఆలోచింపచేస్తున్నాయి. సమాజాన్ని చైతన్య పరచడంలో కవులు ఎప్పుడు ముందే ఉంటారని మరొకసారి స్పష్టమవుతుంది ఈ సంకలనం ద్వారా. ఈ సంకలనంలో ఇంకా పరిశోధించవలసిన విషయాలను నా తరువాతి వరుసలో ఉన్న పరిశోధకులు కోసం కొన్ని అంశాలను విడిచిపెట్టడం జరిగింది. వాటిని కూడా పరిశీలన చేసినట్లయితే గొప్ప సత్యాలను వెలికి తీయవచ్చు అనేది అభిప్రాయం చెబుతున్న.

**ఆధార గ్రంథాలు**

గిన్నారపు, డాక్టర్ ఆదినారాయణ. *నానీల సుగంధం.* మొదటి ముద్రణ, శ్రీమాన్ గ్రాఫిక్స్, హైదరాబాద్, 2023.

గోపి, డాక్టర్ ఎన్. "నాణ్యమైన నానీలు వ్యాసం." హైదరాబాద్.

లలిత వాణి, డాక్టర్ పి. "శిష్యుత్సాహం వ్యాసం." చేవెళ్ల.

రఘు, డాక్టర్ ఎస్. "కవితా సుగంధం వ్యాసం." ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్.

వెంకటేశ్వరరావు, ఆచార్య దార్ల. *అభ్యుదయ భావ తరంగాలు వ్యాసం.* ఫిబ్రవరి, 2025.

శ్రీనివాస్, డాక్టర్ భీంపల్లి. "బలమైన కవితా ప్రక్రియ నానీలు." *మన తెలంగాణ పత్రిక,* హైదరాబాద్.